# కేసీఆర్ దూరదృష్టి.. మాగాణం సృష్టి

## చెరువుల పునరుద్ధరణ, చెక్‌డ్యాంలతో పెరిగిన విస్తీర్ణం

**చిన్న నీటి వనరుల పథకాల్లో టాప్-5లో తెలంగాణ • 5వ సెన్సస్‌తో పోల్చితే రాష్ట్రంలో 10.4% పెరుగుదల**

**జాతీయ సగటు 6.6 శాతమే: 6వ ఎంఐ సెన్సస్ నివేదిక**





హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): గత బీఆర్ఎస్ సర్కారు చేపట్టిన చిన్న నీటిపారుదల పథకాలతో ఆయకట్టు గణనీయంగా పెరిగిందని మరోసారి స్పష్టమైంది. మిషన్ కాకతీయ కింద చెరువుల పునరుద్ధరణ, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, ప్రాజెక్టులతో వాటి అనుసంధానం వల్ల భూగర్భజలాలు పెరిగి, ఆయకట్టు పెరిగిందని కేంద్రజల్‌శక్తి శాఖ తెలిపింది. తాజాగా విడుదల చేసిన ఎంఐ 6వ సెన్సస్ నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. నివేదిక ప్రకారం.. దేశవ్యాప్తంగా మైనర్ ఇరిగేషన్ స్కీములు అత్యధికంగా ఉన్న టాప్-5 రాష్ట్రాల్లో తెలంగాణ ఉన్నది. దేశంలో అత్యధికంగా యూపీలో 39.76 లక్షలు ( 17.2 శాతం), మహారాష్ట్రలో 35.73 లక్షలు (15.4 శాతం) మధ్యప్రదేశ్‌లో 22.85 లక్షలు (9.9 శాతం), తమిళనాడులో 21.15 లక్షలు (9.1 శాతం) ఉండగా, ఐదో స్థానంలో తెలంగాణ నిలిచింది. రాష్ట్రంలో 16,79,868 (7.1శాతం) ఎంఐ స్కీములు ఉన్నాయి. జాతీయ సగటు ప్రకారంలో 5వ సెన్సస్‌తో పోల్చితే రాష్ట్రంలో మైనర్ ఇరిగేషన్ స్కీములు 10.4 శాతం పెరిగాయి. 5వ సెన్సస్ నాటికి రాష్ట్రంలో 15,22,292 పథకాలు ఉండగా, ప్రస్తుతం అవి 16,79,868 పెరిగాయి. తెలంగాణ ప్రభుత్వం ఎంఐ స్కీమ్‌లపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించిందని, ఫలితంగా నీటిపారుదల లభ్యత పెరిగిందని, తద్వారా ఆయకట్టు పెరిగిందని నివేదిక వివరించింది. మిషన్‌కాకతీయ పథకం కింద మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల పునరుద్ధరణ, మేజర్, మీడియంతో ప్రాజెక్టులతో నీటి వనరుల అనుసంధానం, వాగుల పునరుజ్జీవం పథకం కింద చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, ప్రాజెక్టుల కాలువల ద్వారా నీటి విడుదల కారణమని తెలిపింది. దాంతో భూగర్భ జలమట్టం పెరిగి ఆయకట్టు పెరిగిందని పేర్కొన్నది.

### తెలంగాణలో మైనర్ ఇరిగేషన్ స్కీములు

| వర్గం | సంఖ్య |
|---|---|
| బావులు | 4,57,784 |
| షాలో ట్యూబ్‌వెల్స్ | 76,790 |
| మధ్యస్థ గొట్టపు బావులు | 6,77,156 |
| లోతైన గొట్టపు బావులు | 3,67,519 |
| ఉపరితల పథకాలు | 62,753 |
| ఉపరితల లిఫ్టులు | 37,866 |

### ఎంఐ స్కీముల కింద ఉన్న ఆయకట్టు

| వర్గం | సృష్టించిన ఆయకట్టు | వినియోగ ఆయకట్టు |
|---|---|---|
| 5వ సెన్సస్ | 30,14,446 | 22,06,925 |
| 6వ సెన్సస్ | 35,06,333 | 28,88,483 |

### దేశంలో 2.31 కోట్ల మైనర్ ఇరిగేషన్ స్కీములు

2017-18లో 32 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 695 జిల్లాల్లో 6వ ఎంఐ సెన్సస్ చేపట్టగా, ఆ నివేదికను కేంద్రజల్‌శక్తిశాఖ తాజాగా విడుదల చేసింది. దీని ప్రకారం దేశవ్యాప్తంగా 2,31,38,964 ఎంఐ స్కీములు ఉన్నాయి. అందులో 97 శాతం పూర్తిగా పనిచేస్తుండగా, 2.1శాతం పథకాలు పాక్షికంగా పనిచేస్తున్నాయని, 0.9 శాతం స్కీములు పని చేయడం లేదని తెలిపింది. దేశంలోని చిన్న నీటిపారుదల పథకాలన్నీ దాదాపు 94.8 శాతం ఇప్పటికీ భూగర్భ జలాల ఆధారంగానే కొనసాగుతున్నాయని వివరించింది. వ్యవసాయబావులు, లోతులేని గొట్టపు బావులు, సర్ఫేస్‌లిఫ్ట్ పథకాలు గణనీయంగా తగ్గిపోతుండగా, మధ్యస్థ, లోతైన గొట్టపుబావుల్లో విపరీతంగా పెరుగుదల ఉన్నదని స్పష్టం చేసింది.

### దేశవ్యాప్తంగా ఎంఐ గ్రౌండ్‌వాటర్ స్కీములు పనిచేయకపోవడానికి కారణాలు..

| కారణం | దేశ్యాప్తంగా (శాతం) | తెలంగాణ (శాతం) |
|---|---|---|
| భూగర్భ జలాల కొరత | 65.3 | 87.5 |
| ఇతర కారణాలు | 18 | 4.5 |
| మెకానికల్ బ్రేక్‌డౌన్ | 8.2 | 4.2 |
| కరెంటు లేక | 3.6 | 2.1 |
| నిర్వహణలోపం | 2.8 | 1.0 |
| నిధులు లేక | 2.1 | 0.7 |

### దేశవ్యాప్తంగా ఎంఐ స్కీముల వినియోగానికి ఎదురవుతున్న సవాళ్లు..

| కారణం | దేశవ్యాప్తం శాతం |
|---|---|
| సామర్థ్యం మేరకు నీరు లేకపోవడం | 9.9 |
| మెకానికల్ బ్రేక్‌డౌన్ | 52.9 |
| తక్కువ నీటిని విడుదల చేయడం | 7.4 |
| పూర్తి నీటినిల్వ లేకపోవడం | 11.1 |
| కాలువల్లో పూడిక | 5.3 |
| కాలువలు తెగడం | 2.4 |
| ఇతర కారణాలు | 13.6 |

భూగర్భజలాలు మరింత క్షీణించకుండా ఉండాలంటే ఉపరితల నీటివనరులను పునరుద్ధరించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది.

# రైతుకు భరోసా ఇచ్చేందుకే కేసీఆర్ యాత్ర

**నీళ్లుండీ ఇవ్వలేని పాలకులను నిలదీసేందుకే: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**

దేవరుప్పుల, మార్చి 30: నీళ్లుండీ ఇవ్వలేని పాలకులను నిలదీసి రైతులకు తానున్నానంటూ భరోసా ఇవ్వడానికే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదివారం రైతుల చెంతకు వస్తున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని చింతబాయి తండా వద్ద ఎండిన రైతుల వరి చేన్ల వద్దకు కేసీఆర్ రానున్న సందర్భంగా శనివారం ఆయన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి ముందస్తుగా పర్యటించారు. అనంతరం ఎర్రబెల్లి మాట్లాడుతూ.. కేసీఆర్ ఆదివారం ఉదయం ధరావత్ తండా పరిధిలోని చింత బావితండా, పచ్చర్లబావి తండా పరిధిలో ఎండిన పొలాలను పరిశీలిస్తారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో రెండు కార్లు చెరువులు నింపామని, వాగుల్లో చెక్‌డ్యాంలు పారించినట్టు చెప్పారు. కేవలం కాంగ్రెస్ పాలకుల చేతకాని తనం వల్లే రైతులకు సాగు నీరు చేరలేదని, ఈ విషయంలో కేసీఆర్ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి రైతులతో నేరుగా మాట్లాడుతారని తెలిపారు. మార్పు కోరిన రైతులు పంటలను మాడ్చుకున్నారని, ఇకనైనా పార్లమెంట్ ఎన్నికల్లో తిరిగి బీఆర్ఎస్‌ను గెలిపిస్తే పాత రోజులు వస్తాయని చెప్పారు.



జనగామ జిల్లా దేవరుప్పుల మండలం ధరావత్ తండాలో కేసీఆర్ పర్యటించే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి


# కేసీఆర్ రైతు ఉద్యమం

మొదటిపేజీ తరువాయి...

బాధ్యతాయుత పాత్ర అని చెప్తున్నాయి.

**నాడు, నేడు రైతన్నకు అండగా..**

రైతు నోట్లో మట్టి కొట్టే రాజోలిబండ డైవర్షన్ స్కీం (ఆర్‌డీఎస్)పై ఆగస్టు 2003లో అప్పటి రాష్ట్రపతి, ప్రధానమంత్రిని కేసీఆర్ కలిసి నిరసన తెలిపారు. ఆ తర్వాత అనేక దశల్లో ఆందోళనలు చేశారు. పోతిరెడ్డిపాడుకు నిరసనగా ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలోని అన్ని కలెక్టరేట్ల ముందు 2005 అక్టోబర్ 17న గులాబీ దళం ధర్నాలు చేసింది. 2006 ఫిబ్రవరి 12న పోలవరం గర్జన పేరిట భద్రాచలంలో నిర్వహించిన బహిరంగసభ జాతీయ దృష్టిని ఆకర్షించింది. దేశంలో రైతు సమస్యలపై పోరాటాలు చేస్తున్నవారికి, వాటికి సహేతుకమైన పరిష్కారాలు చూపాలని తపించేవారికి కేసీఆర్ మార్గదర్శి అని ఆ సభకు హాజరైన జేఎంఎం నేత శిబూసోరెన్ కొనియాడారు. 2003లో కేసీఆర్ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కోదాడ నుంచి హాలియా వరకు చేసిన పాదయాత్ర రాష్ట్ర సాధన అనంతరం 3 పంటలకు నీళ్లు ఇచ్చేందుకు దోహదం చేసింది. రాష్ట్రంలో ఏ మూలన ఏ పిల్లకాలువ పారుతుందో, ఏ నది నీటితో ఏ ప్రాంతం గొంతు తడపొచ్చు అన్నది కేసీఆర్‌కు తెలిసినంతగా మరెవ్వరికీ తెలియదని విశ్లేషకుల మాట.



**ఆ పోరాటాల స్ఫూర్తితోనే: బీఆర్ఎస్**

బీఆర్ఎస్‌కు ఎన్నికల కన్నా రైతుల కన్నీళ్లు తుడవటమే ముఖ్యమని బీఆర్ఎస్ నేతలు తేల్చిచెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో రైతుభరోసా, రుణమాఫీ హామీలు ఇచ్చి రైతులను నమ్మించిన కాంగ్రెస్.. మాట నిలుపుకోకపోవటంతోనే రైతాంగం దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నదని తెలిపారు. అధికారంలోకి రాగానే ఆ పార్టీ అన్నింటినీ విస్మరించిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చి 120 రోజులు కావొస్తున్నా, ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేకపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పోరాటాల స్ఫూర్తితో రాష్ట్ర రైతాంగానికి బాసటగా నిలవాలని కేసీఆర్ పొలంబాట పట్టారని, ఆదివారం నుంచి కేసీఆర్ జిల్లాల పర్యటన చేయనున్నారని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు మొదలుకొని, అవసరమైతే లక్షల మంది రైతులతో సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అందుకు అంకురార్పణే కేసీఆర్ జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల పర్యటన అని పేర్కొన్నారు. పంటల విస్తీర్ణం, ఎండిన పంట విస్తీర్ణం, రైతుల స్థితిగతులను బేరీజు వేసి గ్రామాలు, మండలాల వారీగా తెలంగాణ భవన్‌కు సమాచారం పంపిస్తే దాన్ని క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని ఇప్పటికే ఆ పార్టీ ప్రకటించింది. రైతులెవరూ బలవన్మరణాలకు పాల్పడకూడదని, ప్రభుత్వం మెడలు వంచి రైతులను ఆదుకుంటామని స్పష్టం చేసింది.

### కేసీఆర్ పర్యటన రూట్‌మ్యాప్

ఉదయం 8.30 గంటలకు ఎర్రవల్లి నుంచి కేసీఆర్ బయల్దేరి 10.30 గంటలకు జనగామ జిల్లా దేవరుప్పల మండలం ధరావత్‌తండాకు చేరుకుంటారు. అక్కడ ఎండిపోయిన పొలాలను పరిశీలించి, రైతుల సమస్యలు తెలుసుకుంటారు. ఉదయం 11.30 గంటలకు సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలంలోకి ప్రవేశిస్తారు. తుంగతుర్తితో పాటు అర్వపల్లి, సూర్యాపేట మండలంలో ఎండిన పంటలను పరిశీలించి, మధ్యాహ్నం 1.30 గంటలకు ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు. అక్కడే మధ్యాహ్న భోజనం చేసి, 3 గంటలకు మీడియా సమావేశంలో పాల్గొంటారు. అనంతరం 3.30 గంటలకు అక్కడి నుంచి బయల్దేరి సాయంత్రం 4.30 గంటలకు నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని నిడమనూరుకు చేరుకుంటారు. అక్కడ పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడుతారు. సాయంత్రం ఆరు గంటలకు బయల్దేరి నల్లగొండ మీదుగా రాత్రి 9 గంటలకు ఎర్రవల్లి చేరుకుంటారు.

# రైతుకు శత్రువుగా కాంగ్రెస్ సర్కారు

- ఒక్క సమీక్ష లేదు.. నీళ్లిచ్చే ఆలోచనే లేదు
- బీఆర్ఎస్‌ను బద్నాం చేసే కుట్రలో రైతులు బలి
- వసూళ్లు, దందాలపైనే పాలకుల దృష్టంతా
- నేడు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కేసీఆర్ పర్యటన
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి



నల్లగొండలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ ప్రతినిధి, మార్చి 30 (నమస్తే తెలంగాణ) : వంద రోజుల పాలనలో ఒక్కనాడు కూడా వ్యవసాయంపై సమీక్ష చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను శత్రువులా చూస్తున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విమర్శించారు. కరువు పరిస్థితుల్లో ప్రభుత్వపరంగా అండగా నిలవాల్సిన ముఖ్యమంత్రి, మంత్రులకు రైతుల గురించి ఆలోచన చేసిన దాఖలాలు లేవన్నారు. కాళేశ్వరంలో వంద టీఎంసీల నీరు వాడుకునే అవకాశం ఉన్నా పట్టించుకోలేదని విమర్శించారు. నాగార్జునసాగర్‌లో గతం కంటే ఎక్కువ నీరున్నా దాన్ని ఎలా వాడుకోవాలన్న దానిపై చిత్తశుద్ధి లోపించిందని మండిపడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో కేసీఆర్ ఉండి ఉంటే ముందస్తు ఆలోచనలతో ప్రత్యామ్నాయ మార్గాల్లో రైతులకు అండగా నిలిచేవారని చెప్పారు. కరువుకుతోడు ప్రభుత్వ బాధ్యతారాహిత్యంతో తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న రైతులకు అండగా నిలిచి ధైర్యం చెప్పేందుకు కేసీఆర్ రంగంలోకి దిగుతున్నట్టు తెలిపారు. ఆదివారం జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో ఎండిన పంటలను పరిశీలిస్తూ రైతులతో కేసీఆర్ మమేకం అవుతారని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం నల్లగొండలోని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా పాలన కంటే మామూళ్ల వసూళ్లపైనే శ్రద్ధ పెట్టారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతుంటే ప్రాజెక్టుల గేట్లు ఎత్తకుండా.. పార్టీలో చేరిక కోసం గేట్లు ఎత్తడాన్ని ఆయన దుయ్యబట్టారు. 'సాగు నీటి కోసం గేట్లు ఎత్తకపోతే ప్రజలే మీ గేట్లు బద్దలు కొట్టి బుద్ధిచెప్పడం ఖాయం' అని హెచ్చరించారు. కాళేశ్వరం నుంచి నాట్ల సమయంలో నీటిని ఇవ్వడం వల్లే పంటలు సాగుచేశారని, తీరా పొట్టకొచ్చే దశలో నీళ్లు బంద్ చేసి రైతులను ఆగం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 25 టీఎంసీల నీరు ఇచ్చి ఉంటే పంటలు పండేవని, నాగార్జునసాగర్ నుంచి కూడా నీటిని విడుదల చేసే అవకాశాన్ని వదులుకున్నారని మండిపడ్డారు. గతంలో సాగర్‌లో ఇంతకంటే తక్కువ నీరున్నా పంటలను కాపాడిన చరిత్ర కేసీఆర్‌ది అని కొనియాడారు. నీళ్లవ్వకుండా పంటలను ఎండబెట్టి, ఆ పాపమంతా బీఆర్ఎస్‌దేనని ప్రజలను నమ్మించే కుట్రలో భాగంగా రైతులను బలిపశువులుగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**రైతులకు అండగా రంగంలోకి కేసీఆర్**

'రాష్ట్రంలో రైతులకు సాగునీరు లేదు. రైతుబంధు రాలేదు. ధాన్యానికి బోనస్ అందలేదు. వేసిన పంట ఎండుతున్నా పట్టింపు లేదు. నష్టపరిహారం ఇద్దామన్న ఆలోచన లేదు. అందుకే కేసీఆర్ రైతులకు అండగా రంగంలోకి దిగుతున్నారు' అని జగదీశ్‌రెడ్డి తెలిపారు. పదిహేను రోజులుగా జిల్లాలో తాము పర్యటిస్తుంటే వచ్చిన రైతు సమస్యలను కేసీఆర్‌కు వివరించినట్టు చెప్పారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో రైతులకు ఊరట కల్పిస్తూ ధైర్యం చెబుతూ... ప్రభుత్వం కండ్లు తెరిపించేందుకు కేసీఆర్ వస్తున్నారని తెలిపారు. కర్రసాయంతో కేసీఆర్ నడుస్తున్నా నేడు జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో ఎండిన పంటలను పరిశీలనకు సిద్ధమయ్యారని చెప్పారు. పలుచోట్ల రైతులతో స్వయంగా మాట్లాడి వారికి భరోసా కల్పించనున్నట్టు తెలిపారు. రేవంత్ సర్కార్ అవగాహన లేమి పాలన, రైతు వ్యతిరేక, ప్రజా వ్యతిరేక పాలనను ఎండగడతామని అన్నారు. బీఆర్ఎస్ మొదటి నుంచి రైతుల పక్షానే ఉంటుందని, నేడు బీఆర్ఎస్ అధికారంలో లేకపోయినా రైతులకు అన్యాయం జరుగుతుంటే ప్రతిపక్ష పార్టీగా రైతులకు భరోసా ఇవ్వటానికి కేసీఆర్ వస్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్ రెడ్డి, బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## కేసీఆర్ పొలంబాట.. రేవంత్ ఢిల్లీబాట!

- రైతులకు భరోసా కోసం కదిలిన బీఆర్ఎస్ అధినేత
- రాజకీయ చర్చలకు 12వ సారి హస్తినకు రేవంత్

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): రైతాంగం దిగాలుపడి దిక్కుతోచని స్థితిలో ఉంటే రాష్ట్ర సర్కారుకు చీమకుట్టినట్టు కూడా లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి సహా మంత్రులెవరూ ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు కనీస ఓదార్పు హామీ ఇవ్వకపోగా మాట వరుసకు కూడా వారిని పట్టించుకోలేదని బీఆర్ఎస్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. కాంగ్రెస్ సర్కారుకు రైతుల కన్నా పార్లమెంట్ ఎన్నికలే ముఖ్యం అయ్యాయని తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయని ఆ పార్టీ ఉదహరిస్తున్నది. సీఎంగా రేవంత్‌రెడ్డికి రైతుల దుర్భర పరిస్థితుల కన్నా ఢిల్లీ పెద్దలతో మంతనాలు, వారిని మచ్చిక చేసుకోవటమే ఎక్కువ అని మండిపడుతున్నది. డిసెంబర్ 7న రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు పదవీ ప్రమాణం చేసినప్పటి నుంచి ఇప్పటిదాకా 12 సార్లు ఢిల్లీలో పర్యటించారని గుర్తు చేస్తూ, ఎంపీ టికెట్లపై చర్చలకు ఆదివారం కూడా వెళ్తున్నారని చెప్తున్నది. రైతు హామీలను విస్మరించి సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ బాట పడుతుంటే, గుండె చెదిరిన రైతన్నకు బాసటగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పొలంబాట పట్టారని ఆ పార్టీ నేతలు చెప్తున్నారు. రైతుల పట్ల తమకు, కాంగ్రెస్ పార్టీకి ఉన్న తేడా ఇదేనని పేర్కొంటున్నారు.



రైతు వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెదిగాలని పెద్దపల్లి బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో 36 గంటల రైతు నిరసన దీక్షలో కూర్చున్న కొప్పుల ఈశ్వర్ తదితర నాయకులు

# రేవంత్ సర్కార్ మొద్దు నిద్ర

- వంద రోజుల్లోనే మళ్లీ పదేండ్ల కిందటి పాలన
- ఎండిన పంటలకు ఎకరాకు 25 వేల పరిహారం ఇవ్వాలి
- బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్
- పెద్దపల్లిలో 36 గంటల రైతు నిరసన దీక్ష ప్రారంభం

పెద్దపల్లి, మార్చి 30 (నమస్తే తెలంగాణ)/ పెద్దపల్లి: 'కాంగ్రెస్ వంద రోజుల పాలనతో మళ్లీ పదేండ్ల కిందటి పరిస్థితిని తెచ్చింది. నమ్మి ఓట్లు వేస్తే.. అధ్వానమైన పాలనతో అన్ని వర్గాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు' అని పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజమెత్తారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ భవన్‌లో 36 గంటల రైతు నిరసన దీక్ష శనివారం ప్రారంభమైంది. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అధ్యక్షతన ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, మాజీ ఎంపీ బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ చిరుమిల్ల రాకేశ్‌తో కలిసి కొప్పుల ఈశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొప్పుల మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో ఎవుసానికి ఎలాంటి కష్టాలుండేవో రేవంత్ సర్కార్ వచ్చినంక మళ్లీ అవే వచ్చాయని, సాగు బాటలో ఉండాల్సిన రైతులు రోడ్ల మీదికి వచ్చి నీటి కోసం, కరెంటు కోసం ఆందోళన బాట పడుతున్నారని తెలిపారు. కాలువల్లో నీళ్లు రాక రైతు కన్నీరు కారుస్తుంటే ఈ సర్కారు ఏ మాత్రం చలించకుండా.. మొద్దు నిద్రపోతున్నదని మండిపడ్డారు. సాగు నీరందక ఎండిన పంటల రైతులను ఆదుకోవాలని, ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం అందించాలని, రైతులను ఆదుకునే వరకు వారికి బీఆర్ఎస్ మద్దతుగా ఉండి పోరాడుతుందని స్పష్టం చేశారు. గత పదేండ్లుగా బీఆర్ఎస్ సర్కార్ రైతులకు, ప్రజలకు ఎలాంటి కష్టాలు రాకుండా కంటికి రెప్పలా కాపాడుకున్నదని, కానీ కాంగ్రెస్ సర్కారు వచ్చిన వంద రోజుల్లోనే ఉమ్మడి రాష్ట్రంలో అనుభవించిన దరిద్రం మళ్లీ వచ్చిందని మండిపడ్డారు. రైతులకు కష్టాలు, కన్నీళ్లే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకోవాలని, మొద్దు నిద్రపోతున్న రేవంత్ సర్కార్‌ను తట్టి లేపి రైతులకు న్యాయం జరగాలనే 36 గంటల రైతు నిరసన దీక్ష చేపట్టినట్టు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు దాదాపు 20 లక్షల ఎకరాల పంట పొలాలు సాగు నీరందక ఎండిపోయాయని అన్నారు. ఎండిన పంటను తగులబెట్టడం, పశువులను మేపుతూ రైతులు బోరున విలపిస్తున్నా రేవంత్ సర్కార్ మనసు కరగడం లేదని, కనీసం ఎండిపోతున్న పంటల సర్వే సైతం చేపట్టడం లేదని విమర్శించారు. ఎద్దేడ్చిన ఎవుసం.. రైతేడ్చిన రాజ్యం పూర్తికాలం నిలువదని, రైతుల ఉసురు తగిలి కాంగ్రెస్ సర్కారు కూలిపోతుందని అన్నారు. పాలన చేతగాక ఇతర పార్టీల మీద విమర్శలు చేస్తున్నారని, ఎమ్మెల్యేలు, నాయకులను పార్టీలో చేర్చుకుంటున్నారని మండిపడ్డారు. ఝూటా మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్‌కు ప్రజలు బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ రైతులను రాజును చేయడమే లక్ష్యంగా అనేక సాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టి బీడు భూములకు సాగు నీరందించిన విషయాన్ని గుర్తు చేశారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# కొనుగోలు కేంద్రాలు హుళక్కేనా?

**పలు జిల్లాల్లో మొదలైన వరి కోతలు • కనిపించని కొనుగోలు కేంద్రాలు**

**సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు • మద్దతు కన్నా తక్కువ ధరకే కొనుగోలు**

**సన్నాలనూ తక్కువ ధరే • సమీక్షల పేరుతో ప్రభుత్వం కాలయాపన**

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): పంటలకు సాగునీరు ఇవ్వడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు చేతికొచ్చిన ధాన్యం కొనుగోలులోనూ నిర్లక్ష్యం వహిస్తున్నది. పలు జిల్లాల్లో వరి కోతలు మొదలై ధాన్యం వస్తుంటే ప్రభుత్వం మాత్రం సమీక్షలతో కాలయాపనచేస్తున్నది తప్పితే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్న సోయి లేకుండా వ్యవహరిస్తున్నది. ప్రస్తుతం ఉమ్మడి నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లో వరి కోతలు మొదలవడంతో ఆయా జిల్లాల రైతులు కొనుగోలు కేంద్రాల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

**మిల్లర్లకు వరంగా ప్రభుత్వ నిర్లక్ష్యం**

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యం రైస్ మిల్లర్లు, ప్రైవేటు వ్యాపారులకు వరంగా మారింది. ఈ ఏడాది ధాన్యానికి మద్దతు ధర క్వింటాలుకు గ్రేడ్ 'ఏ' రకానికి రూ. 2,203, సాధారణ రకానికి రూ. 2,183గా కేంద్రం నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో రైతులకు మద్దతు ధర కూడా దక్కని పరిస్థితి నెలకొన్నది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు తమ ధాన్యాన్ని మిల్లర్లు లేదా ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దీన్ని ఆసరాగా చేసుకుంటున్న మిల్లర్లు, వ్యాపారులు తక్కువ ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నట్టు తెలిసింది. సాధారణంగా నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లో సన్నధాన్యం ఎక్కువగా సాగవుతుంది. ఈ ధాన్యానికి ప్రతిసారి క్వింటాలుకు కనీసం రూ. 2,500 నుంచి రూ. 2,700 వరకు ధర పలుకుతుంది. ఈసారి మాత్రం ఇందుకు భిన్నంగా రైస్ మిల్లర్లు, వ్యాపారులు సన్న ధాన్యం క్వింటాలుకు రూ. 2,200 నుంచి రూ. 2,300లకే కొనుగోలు చేస్తున్నారు. ఇందుకోసం మిల్లర్లంతా సిండికేట్‌గా ఏర్పడ్డారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీజన్ మొదట్లో వచ్చే దొడ్డు ధాన్యానికి కూడా కనీసం రూ. 2,300 వరకు ధర పలుకుతుంది. కానీ ఈసారి దొడ్డు ధాన్యాన్ని రూ. 1950 నుంచి రూ. 2100 వరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు మద్దతు ధర కన్నా రూ. 200 నుంచి రూ. 300 వరకు నష్టపోవాల్సి వస్తున్నది.



**నీటి మూటలుగా హామీలు**

రైతులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నీటి మూటలుగా మారాయి. సకాలంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రైతులు పండించిన ప్రతి గింజను మద్దతు ధరకు అదనంగా రూ. 500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తామంటూ కాంగ్రెస్ నేతలు ఎన్నికల సమయంలో హామీల వర్షం కురిపించారు. అధికారంలోకి రాగానే వాటిని అటకెక్కించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బోనస్, కొనుగోలు కేంద్రాల హామీని ప్రభుత్వం విస్మరించిందంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కండ్లముందే మిల్లర్లు రైతులను దోచుకుంటుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటున్నదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ఏర్పాట్లు ఇంకెప్పుడు?**

ఐదు రోజుల క్రితం పౌరసరఫరాలశాఖ ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించగా, మంగళవారం సీఎస్ శాంతికుమారి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్లపై సీఎస్ ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. ఓవైపు కోతలు ప్రారంభమైనప్పటికీ ఇంకా ఏర్పాట్లు ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించినట్లు సమాచారం. యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు పూర్తి చేసి ఏప్రిల్ 1 నుంచి కొనుగోళ్లు ప్రారంభించాలని ఆదేశించినట్టు తెలిసింది.

**సాగు లెక్కల్లో తేడాలు**

ధాన్యం కొనుగోలు ఏర్పాట్లలో భాగంగా ఈ యాసంగిలో వరిసాగు ఎంత? దిగుబడి ఎంత? ఎంత కొనుగోలు చేయాల్సి వస్తుంది? తదితర అంశాలపై పౌరసరఫరాల సంస్థ ఒక నివేదికను తయారు చేసింది. ఇందులో వరి సాగు విస్తీర్ణంలో వ్యవసాయశాఖ నివేదికకు, పౌరసరఫరాలశాఖ నివేదికకు తేడాలున్నాయి. ఈ యాసంగిలో 66.06 లక్షల ఎకరాల్లో వరి సాగైనట్టు పౌరసరఫరాలశాఖ పేర్కొనగా, వ్యవసాయశాఖ వారంతాపు నివేదిక ప్రకారం ఇది 50.69 లక్షల ఎకరాలే. దీంతో ఎవరి లెక్కల్లో ఎంత నిజముందో తెలియక అధికారులు అయోమయంలో పడిపోయారు.